క్లుప్తంగా

సమస్యలపై ఐటీడీఏ పీవోకు వినతి



ఐటీడీఏ పీవోకు విన్నవిస్తున్న ఆదివాసీలు

కాసిపేట: కాసిపేట ఏజెన్సీ మండలంలోని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయికి ఆదివాసీ సంఘాల నాయకులు విన్నవించారు. మండలంలోని గిరిజన పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు సరిపడా ఉపాధ్యాయులను నియమించాలని, ప్రతి ఆదివాసీ గ్రామంలో అంగన్‌వాడి కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. నూతనంగా ఏర్పడిన ఆదివాసీ గ్రామపంచాయతీల్లో వీటీడీఏలను ఏర్పాటు చేయాలని, గట్రావుపల్లి సబ్‌సెంటర్‌లో రెగ్యూలర్ ఏఎన్‌ఎంను నియమించాలని, 2020–21 సంవత్సరంలో మంజూరైన సబ్సిడీ రుణాలకు ఇప్పటివరకు సబ్సిడీలు అందడం లేదని వెంటనే అందేలా చూడాలని కోరారు. పోడుభూముల పట్టాలకు సరైన రైతులను గుర్తించి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో తుడుందెబ్బ మండల ప్రధానకార్యదర్శి మడావి వెంకటేష్, ఉపాధ్యక్షుడు పెంద్రం శంకర్, సిడాం గణపతి, పెంద్రం ప్రభాకర్, ఆత్రం సంజీవ్, మోతీరాం తదితరులున్నారు.

పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని వినతి



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్

బెల్లంపల్లి: గ్రామప్రజల సౌకర్యార్థం దుగినేపల్లిలో ప్రత్యేక పోలింగ్ బూత్, రేషన్‌షాపు ఏర్పాటు చేయాలని బెల్లంపల్లి మండలం దుగినేపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ డోలే సురేష్ కోరారు. ఆర్డీవో కె.శ్యామలదేవికి సోమవారం వినతిపత్రం అందజేశారు.

రీ వెరిఫికేషన్‌లో విద్యార్థికి 10జీపీఏ

బెల్లంపల్లి: బెల్లంపల్లి సెయింట్ ఆంటోని ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి కె.సాయిచరణ్ సైన్స్ ప్రశ్నపత్రాన్ని రీ వెరిఫికేషన్ చేయించి మెరుగైన ఫలితం సాధించాడు. అదనంగా మార్కులు కలిసి రావడంతో 10జీపీఏ సాధించి సత్తా చాటాడు. పరీక్ష ఫలితాలు వెలువడిన తర్వాత సాయిచరణ్‌కు సైన్స్ పరీక్షలో 89మార్కులు మాత్రమే వచ్చాయి. దీంతో పరీక్ష బాగా రాసిన సాయిచరణ్ ఆ ప్రశ్నపత్రాన్ని రీ వెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేశాడు. దీంతో ఎస్ఎస్‌సీ బోర్డు ఆ విద్యార్థి సైన్స్ ప్రశ్నపత్రాన్ని రీ వెరిఫికేషన్ చేయడంతో ఆ సబ్జెక్టులో అతడికి ఏకంగా 97మార్కులు వచ్చాయి. దీంతో మిగితా ఐదు సబ్జెక్టులతో సరి సమానంగా సైన్స్ లోనూ సాయిచరణ్ 10జీపీఏ సాధించి బెల్లంపల్లి టాపర్‌గా నిలిచినట్లు సెయింట్ ఆంటోని ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ ఠాకూర్ అఖిలేందర్ సింగ్ ప్రకటించారు.

ఘనంగా జాతీయ మత్స్య దినోత్సవం

పాతమంచిర్యాల: జాతీయ మత్స్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా వద్ద మత్స్య పారిశ్రామిక సహకార సంఘం, గంగపుత్ర సంఘం నాయకులు సోమవారం జాతీయ మత్స్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా మత్స్య పారిశ్రామిక సంఘం జిల్లా చైర్మన్ చిన్నయ్య, గంగపుత్ర సంఘం జిల్లా అధ్యక్షుడు నెన్నెల నర్సయ్య మాట్లాడారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం పట్టణ అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, శాఖపురపు శంకర్, మాజీ అధ్యక్షుడు బోరె యాదగిరి, వాడబలిజ సంఘం జిల్లా అధ్యక్షుడు బోడెంకి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు పంపిణీ



లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డులో మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన హరితహారం కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన నర్సరీలోని మొక్కలను ప్రజలకు అందజేసినట్లు తెలిపారు. ప్రజలు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పాడేటి శ్రీనివాస్ గౌడ్, కమిషనర్ ఆకుల వెంకటేష్, వార్డు కౌన్సిలర్ సురేష్‌నాయక్, నాయకులు తిరుపతి, కాంతయ్య, సత్తయ్య, దొంత నర్సయ్య, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణికి స్పందన కరువు

- వెలవెలబోయిన కార్యాలయాలు
- సద్వినియోగం చేసుకోవాలని అధికారుల సూచన



వేమనపల్లి: ప్రజావాణిలో మాట్లాడుతున్న ఎంపీవో

దండేపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఒకే ఒక దరఖాస్తు వచ్చింది. దండేపల్లి అయ్యవారి కుంట(ఎర్రకుంట) మధ్యలో వేసిన విద్యుత్ స్తంబాలను తొలగించాని స్థానిక నవ యువతరం యూత్ ఫిర్యాదు చేశారు.

వేమనపల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి ఎంపీఓ బాపురావు అధ్యక్షతన నిర్వహించారు. మండల స్థాయి అధికారులు వివిధ శాఖలకు చెందిన హాజరుకాకపోగా ఈసీ మధు, ఐకేపీ సీసీ శివరాం, ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజలింగులు పాల్గొన్నారు. ఎలాంటి అర్జీలు రాలేదు.

'ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణం'

చెన్నూర్‌రూరల్: పట్టణంలోని కొత్త బస్టాండ్‌లో అయ్యప్ప స్వామి ఆలయం పక్కన ఎలాంటి అనుమతులు లేకుండా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారని బీజేపీ నాయకులు సోమవారం చెన్నూర్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మున్సిపల్ చైర్మన్ ఎలాంటి అనుమతులు లేకుండా ఈ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారని, షాపింగ్ మాల్ నిర్మాణానికి వరంగల్ నుంచి మున్సిపల్ డైరెక్టర్ అనుమతులు ఇవ్వాలి గానీ, అధికార బలంతో నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. అగ్నిమాపక శాఖ నుంచి కూడా ఎటువంటి అనుమతులు తీసుకోలేదన్నారు. ఇకనైనా అధికారులు షాపింగ్ కాంప్లెక్సును సీజ్ చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు సుశీల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి చింతల శ్రీనివాస్, నాయకులు వంశీ, మహేష్, శివకృష్ణ, సంజయ్ పాల్గొన్నారు.



ఎంపీడీవోకు ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు



భీమారం: పాల్గొన్న ఎంపీడీవో శ్రీనివాస్

'ప్రజావాణి'పై నిర్లక్ష్యం

భీమారం: స్థానిక మండల పరిషత్ కార్యాయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రజావాణిని ప్రజలు నిర్లక్ష్యం చేస్తున్నారని, ప్రజల సమస్యల పరిష్కారానికి, ప్రజావాణిని ఏర్పాటు చేసినా ప్రజలు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందులో వివిద శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయండి

చెన్నూర్: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంపై వివక్షత చూపుతుందని, విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ నెల 12న రాష్ట్ర వ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు దాగాం శ్రీకాంత్ అన్నారు. స్థానికంగా సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి అనిల్, నాయకులు నాగరాజు, సాయి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

నస్పూర్: విద్యా రంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 12న చేపట్టే విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సన్నిగౌడ్, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు సత్యనారాయణ, అభినవ్ కోరారు. నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం మాట్లాడారు. సమావేశంలో నాయకులు సికేందర్, సిద్ధార్థ, సుమన్, సాయికిరణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీకాంత్

కోటపల్లి: విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల బందుకు పిలుపునిచ్చినట్లు ఎస్ఎఫ్ఐ కోటపల్లి మండల కార్యదర్శి అనిల్, ప్రేంకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బందులో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

త్రీఫేజ్ లైన్‌కు మరమ్మతు

సాక్షి ఎఫెక్ట్..

దండేపల్లి: మండలంలోని తాళ్లపేట గ్రామంలో వ్యవసాయ విద్యుత్ మోటార్ల కోసం ఏర్పాటు చేసిన, ఎస్ఎస్–3, ఎస్ఎస్–4 ట్రాన్స్‌పార్మర్ల నుంచి వెళ్లే త్రీఫేజ్ లైన్ రెండు నెలల క్రితం పాడైంది. దాని మరమ్మతుల్లో జాప్యంతో త్రీఫేజ్ విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో, ట్రాన్స్‌పార్మర్ల పరిధి రైతులు ఆందోళన చెందారు. దీంతో మరమ్మతు పనుల్లో జాప్యంపై 'సాక్షి'లో సోమవారం 'త్రీఫేజ్ కరెంట్ ప్లీజ్' కథనం ప్రచురితమైంది. 'సాక్షి' కథనానికి సంబంధిత శాఖ అధికారులు స్పందించి త్రీఫేజ్ విద్యుత్‌లైన్ మరమ్మతు పనులు పూర్తి చేసి, వ్యవసాయానికి త్రీఫేజ్ విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.



మరమ్మతు చేస్తున్న సిబ్బంది

కొనసాగుతున్న పంచాయతీ కార్మికుల సమ్మె



కోటపల్లి: నినాదాలు చేస్తున్న పంచాయతీ సిబ్బంది



సమ్మెలో పాల్గొన్న పంచాయతీ కార్మికులు

కోటపల్లి/బెల్లంపల్లిరూరల్/జన్నారం/భీమారం: తమ న్యాయమైన డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని గ్రామపంచాయతీ సిబ్బంది చేపట్టిన సమ్మె సోమవారం ఐదో రోజుకు చేరింది. ఉద్యోగ భద్రత, పీఆర్సీ నిర్ణయించి వేతనం పెంచాలని, అర్హులైన కారోబార్లను సహాయ కార్యదర్శిగా రూ.10లక్షల ప్రమాద బీమా తదితర డిమాండ్లను పరిష్కరించాలని నినాదాలు చేశారు. బెల్లంపల్లిలో పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు చాతరాజు మురళీధర్ సంఘీభావం తెలిపారు.అనంతరం గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం బెల్లంపల్లి మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామ పంచాయతీల సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మద్దతు

వేమనపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఐదు రోజులుగా సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులకు ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ సమ్మయ్య మాదిగ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చెన్నూర్ అశోక్‌మాదిగ, ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులు కల్యాణ్, ప్రకాష్, శేఖర్ పాల్గొన్నారు.

సమాచారం

నేడు అభివృద్ధి పనులు ప్రారంభం

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలో చేపట్టే పలు అభివద్ధి పనులను మంగళవారం ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ప్రారంభించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు సర్వసభ్య సమావేశం

నెన్నెల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11గంటలకు ఎంపీపీ రమాదేవి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వరలక్ష్మి తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు శాఖల వారీగా నివేదికలతో హాజరుకావాలన్నారు. ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. సమాచారం లేకుండా సమావేశానికి గైర్హాజరైతే సంబంధిత అధికారులపై చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు పేర్కొన్నారు.

23న సదస్సు విజయవంతం చేయండి

మంచిర్యాలఅర్బన్: పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈ నెల 23న జరిగే రాష్ట్ర సదస్సు కోసం సోమవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్, డీటీఎఫ్ నాయకులు రామన్న, రాజావేణు, జయకృష్ణ ఈ సందర్భంగా సదస్సుకు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు.

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి

శ్రీరాంపూర్: రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని డెప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ(డీడీఎంఎస్, మైనింగ్) ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఆర్కె 7గనిని సోమవారం ఆయన తనిఖీ చేశారు. గనిలో దిగి రక్షణ చర్యలను పరిశీలించారు. ఏరియా రక్షణాధికారి శ్రీధర్‌రావు, గ్రూప్ ఏజెంట్ రాముడు, గని మేనేజర్ సాయిప్రసాద్‌లను గనిలో తీసుకుంటున్న రక్షణ చర్యలను అడిగి తెలుసుకున్నారు. జీరో ప్రమాదాలే లక్ష్యంగా పనిచేయాలన్నారు. రక్షణపై కార్మికులకు మరింత అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో గని రక్షణ అధికారి రవిశంకర్, గ్రూప్ ఇంజనీర్ రాజా రవిచరణ్, అండర్ మేనేజర్ రవీందర్, అధికారి జగదీశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.



ఆర్కే 7 గనిలోకి దిగుతున్న డీడీఎంఎస్, ఇతర అధికారులు

'భద్రత– మన బాధ్యత'

జైపూర్: భద్రత మన బాధ్యతగా భావిస్తూ, నా భద్రతే నా కుటంబ భద్రతగా ప్రతి ఒక్క ఉద్యోగి భద్రత నియమాలు పాటినప్పుడే ప్రమాదరహితంగా ముందుకు సాగుతామని బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం కెహెచ్ఎన్ గుప్తా తెలిపారు. జైపూర్ మండలం ఇందారం ఐకే–1ఏ, ఐకే–ఓసీపీపై సోమవారం ప్రమాదాల నివారణ, సురక్షిత పని విధానాలు, పద్ధతుల అమలుపై భద్రతా ప్రత్యేక అవగాహన కల్పించారు. ఐకే–1ఏ, ఐకే–ఓసీపీ ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్‌తో కలిసి బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం గుప్తా ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వ్యక్తిగత భద్రతను ఇంటి నుంచే ప్రారంభించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏజీఎం రామానందం, డీజీఎం శర్మ, ఏరియా సేఫ్టీ అధికారి శ్రీధర్‌రావు, ప్రాజెక్టు ఇంజనీర్ రమేశ్, గని మేనేజర్లు బ్రహ్మం జీరావు, నాగన్న, ఫిట్‌కార్యదర్శి మల్లన్న తదితరులు పాల్గొన్నారు.

'కాంట్రాక్టు కార్మికులకు అండగా ఉంటాం'



సంఘీభావం ప్రకటిస్తున్న ఏమాజీ

కాసిపేట: ఈ ప్రాంత ఎమ్మెల్యేలు, ఎంపీలు, సింగరేణి అధికారులు ఆంధ్ర కాంట్రాక్టర్లతో కుమ్మక్కై, ఇక్కడి యువకులైన కాంట్రాక్టు కార్మికులకు అన్యాయం చేస్తున్నారని పలు పార్టీల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ వేతనాల కోసం సమ్మెకు దిగి నిరసన తెలుపుతున్న ఆర్‌వీఆర్ కాంట్రాక్టు సంస్థ కార్మికులను సోమవారం టీడీపీ పెద్దపల్లి పార్లమెంట్ అధ్యక్షుడు సంజయ్‌కుమార్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొయ్యల ఏమాజీ, కాంగ్రెస్ చెన్నూర్ నియోజకవర్గ నాయకుడు రాజారమేష్ వేర్వేరుగా కార్మికులను కలిసి మద్దతు ప్రకటించారు. కార్మికులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పలు పార్టీల నాయకులు మద్దతు తెలపడంతో దీక్ష శిబిరం వద్ద సందడి నెలకొంది.

బొగ్గుబాయి వార్తలు

దరఖాస్తుల ఆహ్వానం

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సేవాసమితి ఆధ్వర్యంలో టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, మగ్గంవర్క్ కోర్సులపై శిక్షణ ఇవ్వడం కోసం అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏరియా పర్సనల్ మేనేజర్ సల్ల శ్యాంసుందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేర్చుకోవాలనే ఆసక్తి గల సింగరేణి ఉద్యోగుల పిల్లలు, భార్యలు, మాజీ కార్మికుల పిల్లలు, ఓసీలో భూ నిర్వాసితులు ఈ నెల 20లోగా పర్సనల్ విభాగం 7032878575, 9703279787 మొబైల్ నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

యూనిఫాం పంపిణీ

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని ఎస్అండ్‌పీసీ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న 129మంది సిబ్బందికి సోమవారం ఎస్అండ్‌పీసీ ఆఫీస్ ఆవరణలో ఏరియా జీఎం మోహన్‌రెడ్డి యూనిఫాం అందజేశారు.

'అంటు వ్యాధులు ప్రబలే అవకాశం'

శ్రీరాంపూర్: వర్షాకాలంలో దోమలు, ఈగల వల్ల అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకనాథ్ రెడ్డి తెలిపారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై ఆర్ కే 7గనిపై అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు.

ఎస్ఎస్ఎఫ్ చెక్కుల పంపిణీ

శ్రీరాంపూర్: ఎస్ఆర్పీ 3, 3ఏ గనిలో పని చేస్తూ వివిధ కారణాలతో మరణించిన ఉద్యోగులకు కంపెనీ నుంచి చెల్లించే సోషల్ సెక్యూరిటీ ఫండ్ (ఎస్ఎస్ఎఫ్) చెక్కులను గనిపై సోమవారం జరిగిన కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులకు గ్రూప్ ఏజెంట్ గోపాల్ సింగ్ అందించారు.

వంట కార్మికుల ఆందోళన

- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్
- మధ్యాహ్న భోజనం బంద్‌కు పిలుపు



జన్నారం: సమ్మెలో పాల్గొన్న మధ్యాహ్న భోజన, సీఐటీయూ నాయకులు

మంచిర్యాలఅర్బన్: బకాయిపడిన పెండింగ్ బిల్లులు చెల్లించాలని, తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మధ్యాహ్న భోజన కార్మికులు ఆందోళన బాట పట్టారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఈ నెల 10నుంచి 12వరకు మధ్యాహ్న భోజనం బంద్‌కు పిలుపునిచ్చారు. పెంచిన గౌరవ వేతనం సీఎం కేసీఆర్ ప్రకటించినా, ఇప్పటికీ అమలు చేయకపోవటంపై మధ్యాహ్న భోజనం కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని పాఠశాలల్లో సోమవారం మధ్యాహ్న భోజనం నిలిపివేసి నిరసన వ్యక్తం చేశారు. దీంతో ముందస్తుగా విద్యార్థులే స్వయంగా టిఫిన్ బాక్స్‌లు తెచ్చుకోగా.. పేరెంట్స్ వచ్చి పిల్లలను ఇంటికి తీసుకెళ్లారు.

చెన్నూర్: ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు పెంచిన వేతనాలను వెంటనే ఇవ్వాలని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం మండల అధ్యక్షురాలు కరీమా అన్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం టోకెన్ సమ్మె చేపట్టారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంఈఓ రాధాకృష్ణమూర్తికి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వేతనాలు సకాలంలో చెల్లించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను పెంచాలన్నారు. కార్యక్రమంలో నాయకురాళ్లు గట్టక్క, స్వర్గం పోసక్క, సమ్మక్క, మల్లమ్మ పాల్గొన్నారు.

భీమిని: మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ సోమవారం భీమిని ఎమ్మార్సీ సిబ్బందికి మధ్యాహ్న భోజన కార్మికులు, సీఐటీయూ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలు పరిష్కరించకుంటే 11వ తేదీన ఎంఈఓ ఆఫీస్ ముందు, 12వ తేదీన జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తామని పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే నిరవధిక సమ్మెకు దిగుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మంచిర్యాల జిల్లా కార్యదర్శి దాగం రాజారాం, మధ్యాహ్న భోజన కార్మికులు గడ్డం లక్ష్మి, ఈశ్వరి, కళావతి, రాజీవ్‌బాయి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భీమారం: మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్న తమకు, ఏడు నెలల నుంచి ప్రభుత్వం బిల్లులు చెల్లించడం లేదని, ఇందుకు నిరసనగా భోజనం నిలిపివేస్తున్నామని మధ్యాహ్నభోజనం తయారు చేసే మహిళలు తెలిపారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రలోని జెడ్పీ పాఠశాల వంటషెడ్డు వద్ద నిరసన తెలిపారు. మధ్యాహ్నభోజనం చేసి పెట్టడం ద్వారా ఉపాధి లభిస్తుందని భావించనప్పటికీ, పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని వాపోయారు. ప్రతిరోజు వంట సరకుల కొనుగోలుకు అప్పులు చేయాల్సి వస్తోందన్నారు. బిల్లులు చెల్లించేంత వరకు భోజనం తయారు చేయడం నిలిపివేస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్న భోజనం కార్మికులు సమ్మె చేస్తుండటంతో భీమారం జెడ్పీ పాఠశాల విదార్దులకు ఎస్సీ వసతి గృహంలో ప్రత్యేకంగా చేయించినట్లు హెడ్మాస్టర్ వెంకటేశ్ తెలిపారు. విద్యార్థులు మంగళవారం నుంచి టిఫిన్‌బాక్స్‌లు తెచ్చుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు.



జన్నారం: మధ్యాహ్నభోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి బుచ్చయ్య డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మండల విద్యావనరుల కేంద్రం వద్ద సమ్మె చేపట్టారు. సీఐటీయూ నాయకులు అశోక్, రాజన్న, కార్మికుల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు వసంత, అమృత, నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

'హామీలను విస్మరించిన కేసీఆర్'

జన్నారం: సీఎం కేసీఆర్ హామీలను విస్మరించారని టీడీపీ ఆదిలాబాద్ పార్లమెంటరీ అధ్యక్షుడు ఆనంద్ ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. రానున్న రోజుల్లో తెలంగాణలో టీడీపీ సత్తా చాటుతుందన్నారు.

ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి కృషి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణ ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి కృషి చేశానని పట్టణ అధ్యక్షుడు దొంతుల ముఖేశ్ అన్నారు. సోమవారం రాజీనామాను అందించి, నూతన కార్యవర్గంను ఎన్నుకునేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ముక్తా శ్రీనివాస్, చిలువేరు రమేశ్, కేశెట్టి వంశీకృష్ణ, చిలువేరు వైకుంఠం, అంచూరి నగేశ్ పాల్గొన్నారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

జైపూర్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని జైపూర్ ఎస్సై ఉపేందర్ రావు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఎవరైనా గంజాయి, మత్తు పదార్థాలను తీసుకున్న పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాధుర్య, విద్యార్థులు పాల్గొన్నారు.

గడపగడపకూ కాంగ్రెస్

చెన్నూర్‌రూరల్: మండలంలోని అంగ్రాజ్‌పల్లి గ్రామంలో చెన్నూర్ నియోజకవర్గ పీసీసీ సభ్యుడు నూకల రమేశ్ ఆధ్వర్యంలో సోమవారం గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్‌ను ఆదరించి అధికారంలోకి తీసుకురావాలన్నారు.

సేవ చేసే అవకాశం ఇవ్వండి

జన్నారం: మాకు వెన్నంటే ఉండి, రెండు సార్లు ఎమ్మెల్యేగా రేఖానాయక్‌ను గెలిపించి సహకరించిన మీకు సేవ చేసే అవకాశం ఇవ్వాలని టీజీవో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అజ్మీరా శ్యాంనాయక్ అన్నారు. సోమవారం రేండ్లగూడ గ్రామంలో ఉద్యోగ విరమణ పొందిన ఆయనను సర్పంచ్ నెమలికొండ ఆశరాజ్, సిబ్బంది ఘనంగా సన్మానించారు.

నియామకం

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలం కాసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఎలిగేటి తిరుపతి జాతీయ ఉద్యోగుల సంఘం సభ్యుడిగా నియామకం అయినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపాడు. తనను జాతీయ సభ్యుడిగా ఎంపిక చేసిన పలువురి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు కబ్జాకు గురవుతుందని ఫిర్యాదు

దండేపల్లి: మండలంలోని ముత్యంపేట ఇందిరమ్మ కాలనీలో రోడ్డు కబ్జాకు గురవుతుందని కాలనీవాసులు తహసీల్దార్ హన్మంతరావు, ఎంపీడీవో మల్లేశంకు సోమవారం వేర్వేరుగా ఫిర్యాదు చేశారు.

ఆటో యూనియన్ కార్యవర్గం ఎన్నిక

దండేపల్లి: మండలంలోని ముత్యంపేట ఆటో యూనియన్ కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ముత్తె రాజన్న, అధ్యక్షుడిగా రాజయ్య, ఉపాధ్యక్షులుగా గుండారపు రాజన్న, ప్రధాన కార్యదర్శిగా కిషన్, కోశాధికారిగా దుంపల వెంకటేష్, ప్రచార కార్యదర్శిగా ఆకుల మనోజ్, సలహాదారులుగా కుదిరె సత్యనారాయణ, దాసరి రమేష్, బండ రాయలింగు ఎన్నికయ్యారు.